కథానిక

# పరీక్ష తప్పిన రంగారావు

యామిజాల శంకరం

సామదాన భేద దండోపాయాలు రాజనీతి శాస్త్రంలో యుద్ధతంత్రంగా ఉపయోగపడే తరుణోపాయాలు. అప్పటి రోజుల్లో అలా కొన్ని సూత్రాలు రాజకీయ వాతావరణంలో ఏర్పరచబడ్డాయి. సందర్భానుసారంగా యుక్తిచే, మంత్రించేందు కుపయోగపడేవి. నేటివరకూ ఆచరణలో ఉన్నాయి.

ఓ చిన్న తర్జుమాతో సాంఘికంగా కూడా అమల్లో ఉన్నాయంటే నమ్మండి.

*　　*　　*

కొత్త ఊరు కొత్త స్థలం అయితే కొంచెం కొత్తగాను, కష్టంగానే ఉంటుంది. అయినప్పటికీ, ఆ ఊరి జాతక మేమిటో, ఏ గొప్పతనం ఎక్కడ ఉందో తెలుసుకోవాలని, చూడాలని ప్రతివాడికీ కొరుగూరు పోయినప్పుడు పుర్రెలో పుట్టే బుద్ధి. ఎవరికైనా తెలిసినవారిని వెంట తీసుకొని చూట్టానికి పోతాము. లేదా కాళ్లకు బుద్ధి చెప్పి ఒంటరిగానే బయలుదేరుతాం.

అదే జరిగింది, ఆ ఊరు స్కూల్ ఫైనల్ పరీక్షలకు షాచరుగా వచ్చిన రంగారావు పంతులుకు.

సాయంకాలం నాలుగు గంటలకు మొఖం అదీ కడిగి, చక్కని చలువచేసిన ఖద్దరు దోవతి కట్టి, తలగుడ్డతో, తాతలనాడు కుట్టించిన గుమస్తా కోటు ధరించి, చేత కర్రతో, నొసటి పైని సులోచనాలు ధగధగ మెరుస్తూ వుండగా, అచ్చం పగటి వేషగాడిలా బయలుదేరాడు.

మనిషిలో గర్వం కనిపిస్తూ ఉంటుంది. అడుగుల్లో అహంకారం స్ఫురిస్తూ ఉంటుంది, విద్యావేత్తనన్న అహంభావం చూపిస్తూ ఉంటాయి సులోచనాల అడుగున మణిగిన చూపులు.

ఆ వీధి ఈ వీధి చుట్టేసరికి చీకటి పడ్డది. తిరిగి గూటికి చేరుకుందామని గబగబా నడుస్తున్నాడు. ఎలెక్ట్రిక్ దీపాల వెలుతురులు ముఖంమీద పడుతూ, మెరుస్తూ ఉన్నాయి.

ఇంతలో "పంతులుగారు!" వెనకనుండి నల్లగా, లావుగా మొఖాన స్ఫోటకం మచ్చలు కొమ్ముల మాదిరిగా ముఖాన పడుతున్న ఉంగరాల జుట్టుతో, చేత దుడ్డు కర్రను ల మీద వేలాడుకుంటూ ఓ విద్యార్థి పిలిచి, ఎదురుగా వచ్చి పీల్చే సిగరెట్టు విసరి పారేసి ఎదురురొమ్ము ముందుకు త్రోసి రీవిగా నిలుచున్నాడు.

"ఏమబ్బాయ్?" పంతులుగారి ప్రశ్న.

"మీరీవూరు షాచరుగా వచ్చారుటగా?" తెలిసినా ప్రశ్నించాడా విద్యార్థి తెలియనట్టు.

"అవును. ఏం?"

"అః ఏమీ లేదు. మీతో ఓ విషయం మాట్లాడదామని."

"ఏ విషయం?"

"మీకీ ఊరు కొత్త. నేనెవరో నాకు నేను పరిచయం చేసుకోవలసి వస్తోంది. ఇప్పటికి మూడుసార్లీ స్కూల్ ఫైనల్ పరీక్షకు కూర్చున్నాను. కాని ఎందు చేతనో ప్యాసవలేక పోతున్నాను. మావాళ్లు నామీద అనేక ఆశలు పెట్టుకొని గాలిమేడలు కట్టుకొంటున్నారు. కాని ఏ తఫాకి ఆ తఫా అవి కూలి పోతూనే ఉన్నాయి. ఇది ఆఖరుసారి. కాస్త కనికరించాలి."

"అంటే? నేనేం చేయాలి?" అన్నా డర్థం గాక.

"ఓ చిన్న సహాయం. మీరు నన్ను చూసీ చూడనట్టు పోవాలి. అప్పుడు నాకు కాపీ కొట్టేందుకు వీలు చిక్కుతుంది. ఈ పని మీకు చెప్పి చేస్తే బాగుంటుందని నాకు తోచింది." ఎంతో ధీమాగా, ధైర్యంగా ఝంకుపులేకుండా దబాయిస్తున్నట్లు అతనడుగుతూ ఉంటే

పంతులు తెల్లముఖం వేశాడు. క్షణం స్తబ్ధుడై మెల్లగా తేరుకుంటూ,

"కాపీ కొట్టట మెందుకబ్బాయి. కాస్త కష్టపడి ఈ నాల్గురోజులు చదివితే ఇట్టేప్యాసవుతావు" అన్నాడు.

"అబ్బె! అలా అనుకొని మొదటిసారి, దానితో పాటు రెండవసారి పోయింది. ఇప్పుడిహ చదివినా ప్రయోజనం లేదనిపిస్తోంది." విద్యార్థి సమాధాన మిచ్చాడు.

"అయితే మమ్మల్ని ఈ ఊరు పంపిన దెందుకనుకున్నావ్. కాపీ కొట్టేందుకు యే మాత్రం వీలు లేదు" అంటూ కాస్త మందలించి చూచాడు పంతులుగారు.

విద్యార్థి గట్టిగా పిచ్చిగా నవ్వాడు. చేతిలోని మోటుకర్ర నేలమీద కొడుతూ.

"ఇలా అనే రెండు సంవత్సరాలనుండి వచ్చేవా రేమైనారో తెలుసా? ఫలాని ఊరి ఆయనను, ఫలాని ఊరు ఆయనను అడిగి తెలుసుకోండి" అని గర్జించినట్లు మాట్లాడాడు.

నిముషం నిశ్శబ్దం. తర్వాత విచారిస్తున్న ధోరణిలో విద్యార్థి మొదపెట్టాడు: "పాపం! వాళ్ళకు మీమాదిరిగా ముందు చెప్పలేదు. చెపితే వారాపనిచేసి ఉండేవారు కారేమో! కోపంతో వాళ్ళను కొట్టానన్న మాటేగాని, తర్వాత చాలా పశ్చాత్తాపపడ్డాను. కాని ఏం చేసేది? కోపాన్ని చంపుకునే శక్తి నాకు భగవంతుడు ప్రసాదించలేదు."

పంతులుగారు ఇరుకులోపడ్డారు. ప్రక్కత్రోవ త్రొక్కుతూ— "అబ్బాయి! నువ్వు నన్నేదో భయపెడదా మనుకుంటున్నావు? అంతే కదూ? లేకపోతే నువ్వేమిటి వాచర్లను కొట్టట మేమిటి. ఊరివారంతా నోరుమూసు కొని ఊరుకోవడమేమిటి? అసంభవం."

"అలా మీ రనుమానపడడం సహజం కాని ఓగమ్మత్తు. నేనే వాళ్ళనుకొట్టిన వ్యక్తినని ఊరివాళ్ళకు గాదు బ్రహ్మకుకూడా తెలియదు. అసలెవరు కొట్టారో అర్థమైతేగా."

అతణ్ణి చూస్తుంటే, హృదయంలో ఏదీ దాచుకోశక్తి లేనివాడిలా, ప్రతిదీ జరిగింది జరిగినట్లు కొన్నాళ్ళకు కాకపోతే కొన్నాళ్ళకైనా, మళ్ళి మాసిపోయిన తరువాత చెప్పే వాడిలా, పంతు లూహించ గలిగాడు.

మళ్ళీ నిముషం నిశ్శబ్దంగా గడిచింది.

"అబ్బాయ్! అసలు చదవకుండా కాపీ మాత్రం యెలా కొట్టగలవు? కొట్టినా యెలా ప్యాసవగలవు?" ఏదో సలహా ఇచ్చేవాడి మాదిరిగా అమాయకంగా అడిగాడా పాతగూరి పంతులు రంగారావు.

ముట్టిస్తున్న సిగరెట్టు ఘాటుగా పీల్చి, పొగ వదలుతూ, తాపీగా మొదలుపెట్టాడా విద్యార్థి.

"మేష్టారు! అసలు చదవకపోవడ మేమిటి. ఓ పదిహేను మార్కులదాకా వ్రాయగలను. ఓ పదిహేను మార్కులకు కాపీ కొట్టాలి. తప్పదు. మిగతావి యూనివర్సిటీవాళ్ళు కలిపేది ఉండనే ఉందిగా..." పంతులుగారికర్థం కాలా. బుర్ర వంచుకొని పోబొయ్యాడు.

"మేష్టారు! అంతా, విన్నారు కదూ. నమస్తే!"

* * *

పరీక్షల హంగామా జోరుగా ఉంది. వాచరుగా వచ్చిన పంతులు రంగారావు, పిల్లవాళ్ళను 'కాపీలు కొట్టకండి. నేనిక్కడే ఉన్నానన్న'ట్లు వరండాలన్నీ చుట్టవేస్తున్నాడు. తగుమాత్రంగా వాచర్ని చూచి వార్నింగు ఇస్తున్నారు పిల్లలకక్కడ పంతుళ్లు. విద్యార్థులు మాత్రం ఆశను చూచి పదును పెడుతున్నారు పేపర్లకు.

మన కథానాయకుడు మాత్రం దిగులు లేకుండా ధుమాక్రింద కొట్టేస్తున్నాడు కాపీ. ఆహాల్లో ఉన్న తతిమ్మా వాచర్లు చూచి చూడనట్లు వదలేశారతన్ని 'ఏదో ఈ తఫాయైనా బాగుపడనీ' అన్నట్లు. పట్టుకుంటే ఇద్దరిపని రభసేమోనన్న భయంతో అటు ఇటూ పచార్లు మాత్రం చేస్తున్నారు.

రంగారావు పంతులు కిటికీలోంచి కనిపెట్టాడు నిన్న తనను భయపెట్టిన కుర్రాడివ్వాళ నిర్భయంగా కాపీ కొట్టేస్తున్నాడు. ప్రశ్నాపత్రానికి, ఉత్తరపు పుస్తకానికి మధ్య సన్నని కాగితపు చీలిక కదలుతోంది.

వాచరు లోపల ప్రవేశించాడు. ఎవరైనా కాపీకొడుతూఉంటే మామూలుగా తనకు పాఠం చెప్పిన పంతులు కనిపిస్తేనే, గుట్టు చప్పుడు కాకుండా కలంతో ఏదో కెలుకుతూ ఉంటారు — తెచ్చిన కాపీలు చల్లగా దాచి.

వాచర్ని చూచి పంతుళ్లు, "సైలెన్స్, చప్పుడు కాకుండా తలెత్తకుండా వ్రాయండి కాపీలు కొట్టకండి." అంటూ దూడల్ని అదలిస్తున్నట్లు జాగా యెరిగి బైరో అన్నట్టు, వచ్చిన వాచరు కళ్ళనీళ్లు తుడిచేందుకు కాస్త మందలించారు.

వ్రాసే వ్రాసే వాళ్ళకిదొక అడ్డు. కొంతమంది వాచర్లు పరీక్ష మూడు గంటలు లేనిపోని మాటలతో విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలిగిస్తూ ఉంటారు. దీనివల్ల వ్రాసే తలెత్తి "ఏమిటో?" అని ప్రశార్థక ముఖాలితో చూడవలసి వస్తుంది.

మన విద్యార్థి దీనితో కొంచెం తలెత్తి, "అరవకండి! నా ధోరణికి భంగం కలుగుతోంది" అన్నట్లు, చీదరించుకునే ముఖం యొక్క లక్షణాలు ముడివడిన బొమ్మల్లో స్ఫురింపచేస్తూ దించేశాడు.

రంగారావు కిది తీరని అవమానం క్రింద తోచింది. తన మర్యాదకే భంగం కలుగబోతోంది. ఎలా సహించగలడు? తన్ను కొంచెంగా లక్ష్యపెట్టినా అంత బాధపడేవాడు కాదు. అంత నిర్లక్ష్యమా? వీడి బ్రతుకేదో బయటపెట్టాలనే ఉద్దేశం అతనిలో కలిగింది. ఉద్రేకంతో హెడ్ మాస్టర్ రూంలోకి చొచ్చుకొపోయాడు.

"ఈ ప్రక్క రూములో ఓ కుర్రాడు కాపీ కొడుతున్నాడు. అతన్ని పట్టుకోవాలి. అందుకు మీ సహాయం అవుసరం" అన్నాడు. గర్జించే మేఘాలమీదికి విసరే రాళ్ళలాగా ఉంది ఆ ధ్వని.

హెడ్మాస్టరు తటపటాయించాడు. అతని కేమీ తోచలా "అందుకు నేనేం చేయాలి?" అన్నాడు.

"అతన్ని పట్టుకోవాలి. అంతే కాదు, శాశ్వతంగా అతన్ని చదువుకోనీయకుండా చేయాలి. ఈ జన్మలో అతనిక తలెత్తటానికి వీలులేదు" అన్నాడు దృఢంగా వాచరు.

"ఏదో కాపీ కొట్టాడని, శాశ్వతంగా నాశనం చేయటమా?" తడబడ్డాయి హెడ్ మాస్టర్ మాటలు.

"అవును. నా సంకల్పానికి తిరుగులేదు. ఇంతవరకు లేదు. ఇకా ఉండదు. ఉండబోదు. నా జీవితం ఆలాగే గడుస్తోంది. అవమానాన్ని సహించేవాణ్ణి కాదు. మీ వూరు వచ్చినందువల్ల నా మర్యాదకు, నా గౌరవానికే తీరని అవమానం ఆపాదించుకోవడం నా కిష్టంలేదు. నేనంటే లక్ష్యం లేనప్పుడు, నే నెందుకు లక్ష్యపెట్టాలి."

"ఇప్పుడేం జరిగింది. ఎవరన్నా మీతో దురుసుగా మాట్లాడారా?" అన్నాడు హెడ్ మాస్టరు, ఏదో అయిపోయింది సర్దివేద్దామన్న ఉద్దేశ్యంతో.

"అవ్వన్నీ ఇప్పుడప్రస్తుతం. కార్యం జరిగి తీరాలి లెండి." అంటూ కుర్చీలోంచి లేచి బయలు దేరాడు వాచరు.

హెడ్మాస్టరు ఇరుకులో పడ్డాడు. ఇటు చూస్తే వాచరు కోపంతో రగిలి పోతున్నాడు. శాంతించే సూచనలెచ్చటా కనుపించటంలేదు. అటు చూస్తే విద్యార్థి కాపీ కొడుతున్నాడు.

ఎలా చేస్తే మంచిది? ఏమి చెయ్యాలి? ఏమీ చెయనక్కరలేదా? ఆ సమయంలో ఏమీ పాలుపోలేదు. తప్పనిసరిగా వాచర్ని అనుసరించాల్సి వచ్చింది.

కాపీ పట్టుకో బడింది.

* * *

అన్నం ముందు కూర్చుని చేసిన ఘనకార్యం పూస గ్రుచ్చినట్లు, మరి నాల్గు కల్పనలతో భార్యకు చెప్పుకు పోతున్నాడు రంగారావు. భార్య భర్త తెలివి తేటల్ని అభినందిస్తున్నట్లు "ఊఁ"కొడుతోంది.

"అబ్బ! పులుసులో చింతపండు ఎక్కువై పులుపెక్కువైంది. ఇంత బెల్లం తగలేశావు కాదు."

"ఇహ మీకు వండిపెట్టటం నావల్లకాదు. అబ్బబ్బ! ఏదిచేసినా వంకపెట్టకుండా తిన్నరోజేదీ? తక్కువైతే తక్కువయినదని, ఎక్కు—

వైతే ఎక్కువయినదని నా ప్రాణాలు తీసేస్తున్నారు" అని కాస్త విసుగుకుంది కూని రాగాలుతీస్తూ భార్య.

"సరేలే పోనీ ఇందాక విషయం సాంతంగా విన్నావు కాదు. ఆ వూళ్ళో అతనంటే హడలు. ఇప్పుడు చూడు మనమంటే అతనికి హడల్. లేకపోతే ఏమిటి చెప్పు—ఆ దౌర్జన్యం" చేసిన కౌర్యాన్ని సమర్థిస్తూ అన్నాడు.

"ఏమండీ! తెలియక అడుగుతాను. అతను కుర్రాడు గదా, కుర్రతనంలో తెలిసి తెలియక ఏదో అన్నాడని మీరు ఇంత పెద్దవారు సర్వం తెలిసినవారు అతని జీవితం పాడుచేయటం న్యాయమేనా?"

"న్యాయం...నీకు జొత్తిగా లోకజ్ఞానం శూన్యం. వచ్చిన వాచర్లందర్ని వాడు కొట్టడం న్యాయమేనా? అతను చేసింది బాగుందిగాని, ఇహ నేను చేసింది తప్పు అంతేగదూ? అసలిలా ప్రతియేడు ఓ ఇద్దరు ముగ్గుర్ని చేస్తూ ఉంటే మిగతావాళ్ళు ఇహ జన్మలో కాపీలు కొట్టరు."

"అది కాదండి .." ఏదో చెప్పబోయింది భార్య.

"మరేమిటి? అతడు ఈ ఊరువచ్చి ఇంకా తన్నిపోతాడనేనా నీ భయం?"

"ఆ భయం మీకు లేకపోబట్టే కదూ ఉన్న నాల్గురోజులు పోలీసు కాపలా పెట్టించుకొని, బండి ఎక్కిందాకా వెంట ఉంచుకున్నారు" అంది వ్యంగంగా అర్థాంగి

"నోరుముయ్యి నాకేం భయంలేదు. ఇక్కడికొచ్చి కొడతాడా? కొడితే ఈ ఊరుదాటి అడుగు అవతల పెట్టగలడా?"

"ఏంచేస్తారు? కేసు పెట్టేందుకైనా సాక్ష్యముండాలిగా? అలా మీకు సాక్ష్యముండేటట్టు అతనెందుకు చేస్తాడు."

ఇలా వారి సంభాషణ ఘర్షణలోకి దిగింది.

"మేష్టారు" ఘట్టిగా బయటనుండి కేక.

"ఎవరూ?" అంటూ వీధి అరుగుమీద అడుగు పెడుతున్నాడు వాచరు. అంతే. ప్రక్క తలుపు చాటునుండి దుడ్డుకర్రదెబ్బ దిమ్మతిరిగేటట్లు తగిలింది తలమీద. మెలికలు తిరిగి విరచుకొని క్రిందపడ్డాడు.

పడటమే ఆలస్యంగా రెండో దెబ్బ నడుం మీద తగలటంతో, ఎముకలు స్థానాలు తప్పాయి కాబోలు పాపం, "అమ్మా!" అని ఎప్పుడో చచ్చిన తల్లిని స్మరించాడు.

ఈ పడిన చప్పుడు, ఈ దెబ్బల చప్పుడూ అయినందువల్ల భార్య భయంతో బయటకు వచ్చింది. శవంలాగా పడివున్న భర్తను చూచింది.

మూడో దెబ్బ పడబోతోంది. అదే సమయంలో "ఏమండీ" అంటూ భర్తమీద పడ్డది. ఆమెకు తెలియదు కొట్టే మనిషి అక్కడే ఉన్నాడని. విసరే కర్ర ఊపుఆపలేక వదలేశాడు. ఆ దెబ్బ ఆవిడకు తగిలేసరికి బేజారెత్తి పారిపోయాడా కొట్టే వ్యక్తి.

తెల్లవారి గవర్నమెంటు హాస్పటల్లో మంచంమీద కొనఊపిరితో కదులుతున్నారు ఆ దంపతులిరువురూ.

లోకోద్ధరణ సంఘం తాలూకు ప్రచారకుడు ఉపన్యాసం దంచేస్తున్నాడు: "నాయనలారా! పొగ తాగుడు మానండి! చేచేతులారా ఆయుర్దాయాన్ని తగ్గించుకోకండి! మీరు తాగే ప్రతిచుట్టా మీ ఆయుర్దాయం మూడుగంటలు హరించేస్తుంది. ప్రతి సిగరెట్టూ ఏడుగంటలు హరిస్తుంది."

సభలోంచి ఓ పెద్దమనిషి లేచి అడిగాడు: "అయ్యా, ఆ లెక్కలు శాస్త్రీయమైనవేనా?"

"నిరభ్యంతరంగా!" ఉపన్యాసకుడి జవాబు.

పెద్దమనిషి, "అయితే నేను వంద ఏళ్ళక్రితం చచ్చిపోయి ఉండవలసింది!" అన్నాడు.